**కథ**

# గండికోట పతనం

తెన్నేటి శ్యామకృష్ణ
94909 95015

**క్రీ.శ.** 1652. ఎర్రమల కొండలపైన దర్పంగా నిలిచి ఉన్నది గండికోట గిరిదుర్గం. పెమ్మసాని చిన తిమ్మానాయుడు కోట బురుజుపైన నిలబడి.. ఒకసారి కోట నలుముఖాలా పారజూశాడు. ఆయన పక్కనే నిల్చొని ఉన్నాడు సేనానీ, బావమరిదీ అయిన శాయపనేని నరసింహ నాయుడు.

కోట ప్రాకారం ఎర్రటి నున్నని శాణపు రాళ్లతో నిర్మితమైంది. వృత్తాకారంలో ఉండే కోట చుట్టుకొలత.. దాదాపు ఐదు మైళ్లు ఉంటుంది! కోట ముఖద్వారానికి ఉన్న ఎత్తయిన కొయ్య తలుపులు.. ఇనుప రేకుతో తాపడం చేసి ఉన్నాయి. తలుపులపైన ఇనుప మేకులున్నాయి. కొండ రాతిపై పునాదులు లేకుండా గోడలు నిర్మించారు! ఆ గోడలు ముప్పై రెండు నుంచి నలభై రెండు అడుగుల దాకా ఎత్తున్నాయి. చతురస్రాకారంలోనూ, దీర్ఘ చతురస్రాకారంలోనూ నలభై బురుజులున్నాయి. గోడ పైభాగాన సైనికుల సంచారం కోసం సుమారు పదహారు అడుగుల వెడల్పుతో బాట ఉన్నది!

అల్లంత దూరంలో పక్కనే లోయలో ప్రవహిస్తున్నది పెన్నా నది. ఆవల పక్క మళ్లీ నిట్రంగా నిలబడి ఎర్రమల కొండలు.. లోయ పొడవునా పరుచుకుని. నిజానికి ఎర్రమల కొండల్ని రెండుగా కోస్తూ.. పెన్నా ప్రవహించడం వల్ల ఏర్పడినదే ఈ గండి, లోయ! అందుకే.. ఈ కోట గండికోట అయింది! కొండ అంచుకు వెళ్లి నిలబడిచూస్తే ఒక మూడువందల అడుగుల దిగువ వరకూ లోయ నిట్రంగా, కోటగోడలా నిలబడి.. కింద నదీ లోయకు దారితీస్తుంది. గండికోటకు ఆవల అది ఒక పెట్టని కోట!

తిమ్మానాయుని చెయ్యి అప్రయత్నంగా అతని మీసంపై నిలిచింది. కళ్లు ఎర్రని జీరలు పొడసూపినవి.

''మనం మన వంతు కప్పం చెల్లించినాము. అయినా కుతుబ్‌షా తన సైన్యాన్ని పంపించినాడు. కోటను వశం చెయ్యమంటాడు. ఇదంతా ఆ మీర్ జుమ్లాగాడి పని. పారశీక దేశంనించి వచ్చిన వజ్రాల వ్యాపారి, వాడొక గజదొంగ. కుతుబ్‌షా ప్రాపకం సంపాదించి అక్కడ వజీరు స్థానానికి ఎగబాకాడు. ఇప్పుడు మన సీమలోని వజ్రపు గనులపై గురిపెట్టినాడు. ఇప్పుడు వాడే ముందుండి సైన్యాన్ని నడిపిస్తున్నాడు! వానికి సహాయంగా ఆధునిక యుద్ధ తంత్రం తెలిసిన మైలీ అట.. ఫ్రెంచ్ ఫిరంగుల నిపుణుడు కూడా ఉన్నాడు. మూడు ఫిరంగులు వెంటవేసుకు వస్తున్నాడట!''.

నరసింహనాయుడు తన వొరలోని కత్తిపిడిపై చేయి ఆనించి అన్నాడు..

''ఔను బావా! పైగా గోలకొండ దర్బారులో ఉన్నతాధికారి పొదిలి లింగన్న వానికి వత్తాసు పలుకుతున్నాడు'' అని చెప్పి, ఆగి మళ్లీ అన్నాడు..

''వాడు ఫిరంగులు కొండపైకి తేలేడుగాక తేలేడు! అటు చూడు బావా.. రెండు బురుజులపై నిలిచి ఉన్న మన రెండు ఫిరంగులు, శత్రువు రావడానికి ఉన్న ఒకే ఒక మార్గాన్ని గురిపెట్టి నిలుచున్నాయి. కోటను పట్టుకోడానికి వాని అబ్బ దిగిరావాలి!''.. అంటూ పళ్లు నూరాడు నరసింహుడు.

ఒకవేళ శత్రువు కోటలోకి ప్రవేశించగలిగినా ఎదుర్కొని పోరగల సత్తా ఉంది తమకు. చిన తిమ్మానాయుడు స్వయంగా కత్తి పట్టి గుర్రమెక్కి పోరగల సమర్థుడు. మీర్ జుమ్లా సేన పెద్దదే కావచ్చు. కానీ, తమ సేన ధైర్యసాహసాలు ఎదురులేనివి! చిన తిమ్మానాయుడు వెనుదిరిగి ఒకసారి కోట ఆవరణలోకి తొంగిచూశాడు. కోటలో తన అశ్వ, పదాతి దళాలు కవాతు చేస్తున్నవి. ఆయుధధారులై దళపతులు ముందుండి ఆజ్ఞలను ఇస్తున్నారు. కోటలో చెరువున్నది. తిండి, యుద్ధసామగ్రి ఎన్నిరోజులకైనా సరిపడా ఉన్నది. ఆపై రంగనాథుడు ఉన్నాడు! తిమ్మానాయుడు ఒకసారి దూరంగా అగుపిస్తున్న ఆలయంవైపు తిరిగి మనసులోనే నమస్కరించాడు.

* * *

